పగటి కలలు

నిజంగా నా అంత అదృష్టహీనుడుండడు. కనకనే నా కాలేజీ చదువు పూర్తికాకముందే మానాన్న పోయినాడు. ఆయన ఇంకొక్క ఏణ్ణర్ధం బతికుంటే బియ్యే పూర్తిచేసేవాణ్ని గద! యాజుల్లాగా ట్రెయినింగు పూర్తిచేసి స్కూలు మేష్టరు పనిలో ప్రవేశించి ఉండేవాణ్ణిగద! నిజానికి స్కూలు మేష్టరు పనంత సుఖం ఇంకోటి లేదు. ఏటా కొత్తపిల్లలు వస్తుంటారు. బోలెడన్ని శలవలు. రొష్టులేని జీవితం, పరువు మర్యాదలుంటాయి. ఎప్పటికైనా హెడ్మాష్టరైపోవచ్చు— ఎవడు చూశాడు? మనకింద చదువుకున్న పిల్లల్లో ఒక అరడజనుమంది గొప్ప వాళ్ళయితే ఇంక మనకి కావలసిందేమిటి?

చిత్రం! మానాన్న ఎన్నడూ యాభై రూపాయలు మించి ఏనెలా గడించ లేదు. అయినా జీవితం ఎంతో సుఖంగా వెళ్ళింది. ఆ జీతంమీదే ఆయన ఇల్లు కట్టాడు. ఇళ్ళ స్థలాలు కొన్నాడు. వాటినమ్మి పొలాలు కొన్నాడు. ఆయన ఆ పని చేయబట్టే ఈనాడు మాకు తలదాచుకునేటందుకు కొంపా, తినేటందుకు

ఏటా నాలుగుపుట్ల గింజలూ ఉన్నాయి. లేకపోతే మాగతి ఏమై ఉండును?....ఆ మాటకువస్తే ఇప్పుడు మాగతి ఏమయ్యేట్టు? మా సీతకు అప్పుడే పదకొండో ఏడు కూడా ప్రవేశించింది. ఎట్లాగైనా ఈ ఏడాదిలోగా దాని పెళ్ళి కాకపోతే మా అమ్మ ఆత్మహత్య చేసుకుంటుంది. దాని పెళ్ళికి ఎంతలేదన్నా మూడు నాలుగు వేలు ఖర్చవుతుంది. ఏ దారేపొయ్యేవాడికిచ్చినా వెయ్యినూటపదహార్లు కట్నం ఇవ్వాలి సీత పెళ్ళికయ్యే ఖర్చు నేనే భరించాలి. ఈ భారం నామీద ఉన్నది. మానాన్న స్థలాలూ పొలాలూ కొన్నాడంటే ఎందుకు కొనడూ? ఆయన తన సంపాదనలో నుంచి మా భారసాలలు తప్ప ఇంకేమీ చెయ్యలేదు. తీరా బరువు మీదపడే సమయానికి దాటిపోయినాడు.

నాకేదన్నా ఉద్యోగం దొరికినా బాగుండిపోను....అయినా ఏం ఉద్యోగాలు? ఎంత పెద్ద ఉద్యోగం దొరికితే నేను సీత పెళ్ళిచేసే డబ్బు ఆదా చెయ్యగలుగుతాను?....ఆ చలపతిరావుకు వచ్చినట్టు నాక్కూడా క్రాస్‌వర్డ్ పజిల్‌లో ఏ పద్నాలుగువేలో రావాలి. అంతకన్న మరో మార్గంలేదు. ఏం? ఎందుకు రాగూడదూ? క్రాస్‌వర్డ్ పజిల్ బహుమానాలు భాగ్యవంతులకే రావాలని రాసి పెట్టి ఉందా? అదృష్టం—అంతే....నిజంగా పద్నాలుగువేలు వస్తే ఎంత బాగుంటుంది! అయిదారువేలు ధారాళంగా ఖర్చుచేసి సీత పెళ్ళి జంయ్యమని చేసేయ్యొచ్చు. నాలుగువేలు కట్నంపోస్తే మంచి సంబంధం రాకేంజేస్తుంది? తండ్రిపోయినా కుర్రాడు చెల్లెలికి మంచి సంబంధమే తెచ్చాడని నలుగురూ సంతోషిస్తారు. అసలీ పద్నాలుగువేలలో కానీ ఖర్చు చెయ్యక్కర్లేదు. అంత డబ్బు దగ్గిరుంటే మనకే బోలెడంత కట్నమిచ్చి ఎవరుపడితే వాళ్ళు పిల్లనిస్తారు. ఆ కట్నంతో సీత పెళ్ళి చేసేయ్యొచ్చు. ఆ తరువాత దగ్గిరున్న ఈ డబ్బుతో ఇంకా క్రాస్‌వర్డ్ ప్రైజులు కొట్టొచ్చు. అవసరమైతే తడవకు వెయ్యేసి రూపాయల కూపన్లు నింపి పంపితే సరి; రాక చస్తుందా ఫస్టుప్రైజు?....

సీత పెళ్ళికోసం అమ్మ నన్ను పెళ్ళి చేసుకోమంటుంది. నాకు నా అత్తవారిచ్చే కట్నం కొంతవరకైనా సీత పెళ్ళికి అక్కరకొస్తుందని ఆవిడ వుద్దేశం. నాకు కట్నమిచ్చి పిల్లనెవరిస్తారు? పిల్ల అందచందాలు చూడకుండావుంటే కట్నం బాగానే వస్తుందంటుంది అమ్మ. ఆ నాగయ్యగారి కూతురులాటి వెర్రి బాగులదాన్ని చేసుకుంటే కట్నం బాగానే యిస్తారు. కాని అటువంటి పిల్లనెట్లా చేసుకోవటం? ఆ పిల్లను చూస్తే జాలేస్తుంది. కాని అటువంటదాన్ని పెళ్ళాడి కాపరం చెయ్యటంకంటె భయంకరం ఇంకేముంటుంది? అమ్మపైకి అనదుగాని నేనా అమ్మాయిని చేసుకోవటానికి ఒప్పుకుంటే ఆవిడ చాలా సంతోషిస్తుంది.

కట్నాల విషయం వచ్చినప్పుడల్లా 'ఆ నాగయ్యగారు అయిదువేలు కట్నం ఇవ్వటానిక్కూడా సిద్ధంగావున్నారు. ఎవరిరాత్రి నేతిలో పడుతుందోగాని అంటుందమ్మ.

ఆడవాళ్ళ మనస్సులెంత విచిత్రంగా పనిచేస్తాయో! సీతని డబ్బుగల వెర్రిబాగులవాడికో, ముసలాడికో ఇచ్చి చెయ్యటానికి ఒప్పుకుంటే నిక్షేపంగా, కానీ ఖర్చు మనకు తగలకుండా పెళ్ళయిపోతుంది. కాని అటువంటి ఆలోచనకు అమ్మ ఒక్కనాటికి ఒప్పుకోదు. కాని నేను వెర్రిబాగులదాన్ని పెళ్ళాడి యే అయిదువేలో కట్నం పుచ్చుకుంటే ఆవిడ చాలా సంతోషిస్తుంది! ఎక్కడుందో ఈ తేడా?

ఒక్కొక్కసారి అమ్మ మాట్లాడుతుంటే ఆవిడ నా జీవితాన్ని దుర్భరం చెయ్యటానికి మాట్లాడుతున్నదా అనిపిస్తుంది. కాకపోయినా సీత పెళ్ళికిప్పుడేం మునిగిందీ? ఇప్పుడాడ పిల్లలకు పదిహేడో ఏటా, పద్దెనిమిదో ఏటా పెళ్ళిళ్ళు చేసేస్తున్నారుగా? సీతక్కూడా ఇంకో ఆరేడేళ్ళు ఆగి పెళ్ళిచేస్తే నాకెంత హాయి! ఈలోగా ఏ వుద్యోగంలో ప్రవేశించినా అప్పటికి నాలుగురాళ్ళు తెచ్చుకుంటూ వుంటాగదా! ఈలోగా తమ్ముడు, సూర్యంగాడుకూడా యేదన్నా కాస్త సంపాదనలో పడితే అప్పుడు సీత పెళ్ళిచెయ్యటం యెంత ఉసులు!....ఆ మాట కొస్తే అప్పటికి సీత పరిస్థితి ఎట్లా వుంటుందో ఎవరు చూశారు? అదృష్టం బాగుంటే అది యే సినిమాల్లోనైనా చేరిపోగూడదూ? అదేం అందవికారమైన పిల్ల కాదే. చామనచాయయైనా కనుముక్కుతీరు గలపిల్ల. పైగా సినిమా పాట లన్నీ దంచిపాడేస్తుంది. దానికి వయసొచ్చేసరికి ఈనాటి తారలంతా పాతబడి పోయుంటారు. సీతకు మంచి ఛాన్సు. ఇప్పుడే సినిమాతారలు లక్షలు సంపా దిస్తున్నారు. ఇంకో ఆరేడేళ్ళకి కోట్లు సంపాదిలచరూ? పదేళ్ళ కిందట వున్న సంపాదనతో పోలిస్తే ఈనాడు సినిమా సంపాదనలు యెంత జాస్తి! సీత సినిమా తారైతే దర్జాగా మంచి మంచి కార్లెక్కి తిరగొచ్చు. కాని ఒకటే యిబ్బంది ...దాని సంపాదనమీద మనం బతకటం పరువైన పనిగాదు. అంత గొప్పదైపోయినాక సీత మనని ఆపేక్షగా చూస్తుందని యేమిటి? వీడు మనమీద పడి తింటున్నాడే అని అనుకుంటే. ఛీ! అటువంటి మాట పడనే కూడదు. మనుషులకు విశ్వాసం తక్కువ. 'ఒకప్పుడు వీడు మన పెళ్ళికోసం వెర్రిబాగుల పిల్లను పెళ్ళాడటానికి కూడా సిద్ధపడ్డాడే' అన్న విశ్వాసం సీతకు వుంటుందనా? ఎన్నటికీ వుండదు. దాని కార్లో యెక్కి మనం తిరుగుతున్నామన్న విషయం మటుకే అది గమనిస్తుంది. డబ్బు నిజంగా ఎంత పాపిష్టిది; అది మనుషుల్ని ఇట్టే మార్చేస్తుంది. మనం నీతికి నిలబడి మారటానికి ఒప్పుకోం గనకే మనకు

డబ్బురాదు. చలమయ్యే చూడరాదూ, దొంగ వ్యాపారంచేసి రెండు చేతులా సంపాదించాడు; ఇంకా సంపాదిస్తున్నాడు. వెనకగా ఆయన్ని అందరూ తిట్టే వాళ్ళే. అయినా యెదుట పడ్డప్పుడు దేవుణ్ణి చూసినట్టు చూస్తారుగద! పదేళ్ళ కిందట చలమయ్య దగ్గిరేముంది, బూడిదె? ఏదో అవకాశం దొరికింది. దానిమీద అల్లుకొచ్చాడు. అటువంటి అవకాశం మనకూ రావొచ్చు, ఎవరు చూశారు? మొదటి లక్ష చేర్చేదాకానే కష్టం. ఆపైన ఎన్ని లకారాలైనా వాటంతటవే చేరుతాయి. డబ్బు చేరినాక కావలసినంత కీర్తి. బోలెడంత పలుకుబడి, అంతు లేని అవకాశాలు. అధికారులుకూడా మన అడుగులకు మడుగులొత్తుతారు.

మనుషుల్లోవుండే లోపమేమిటంటే వాళ్ళు అడవిలో ముత్యపుచిప్పలు వెతుకుతారు. మనిషికి అన్నింటికన్న ముఖ్యంగా కావలసింది డబ్బాయె. ఆడ పిల్లలకు పెళ్ళిళ్ళు చెయ్యాలన్నా, లాభసాటిగా దొంగ వ్యాపారం చెయ్యాలన్నా, అధికార్లను కూడగట్టాలన్నా, ఇంత పలుకుబడి పరువుప్రతిష్ఠలూ సంపాదించా లన్నా డబ్బులేక సాధ్యపడదాయె. డబ్బు పాపిష్టిదని తెలిసికూడా మడిగట్టు క్కూచుని లాభమేమిటి? ఏనాటికైనా నీళ్ళలో దిగినవాడికి ఈతవస్తుందిగాని ఒడ్డున కూచుని నీళ్ళని శాపనార్థాలు పెట్టేవాడికి ఈతేం వస్తుందీ?

మనవంటి వాళ్ళం డబ్బుకిబ్బంది ఎందుకు పడుతున్నామో నా కర్థ మయింది. డబ్బు సంపాదించే పద్ధతులన్నీ చెడ్డవేనన్న వేదాంతం మనకు చిన్నప్పటినుంచి యెవరో నూరిపోశారు. అదే మనకొంప తీస్తున్నది. మా కామేశ్వ్రరావు చూడరాదూ? అన్నిటికన్నా కళలు యెక్కువైనవంటాడు. డబ్బుకన్నాట! ఎన్ని లక్షల రూపాయలుకూడా ఒక గొప్ప పాటకూ, బొమ్మకూ, పుస్తకానికి సమంకావుట! కామయ్య ఉత్సాహాతిశయంతో చెబుతుంటే, నాక్కూడా అది నిజమే అనిపించింది, చెప్పొద్దూ? కాని ఏమయిందీ? కిందటి నెల సినిమా నటుడు జగన్నాథం మావూరు వచ్చినప్పుడు ఊళ్ళో కళాకారులంతా అతనిచుట్టూ చేరి మూడు రోజులపాటు రాత్రింబగళ్ళు రాంభజన చేశారు. జగన్నాథం అన్ని కళల్ని గురించీ మాట్లాడాడు. ఆయనగారికి ఏ కళలోనూ ప్రవేశం లేకపోయినా మా కళాకారులు అతను చెప్పినదానికల్లా బుర్ర ఆడించారు. కథలు రాసేవాళ్ళు అతన్నడిగి కథలెట్లా రాయాలో తెలుసుకున్నారు, బేగడరాగం రెండు గంటలు ఆలాపన చెయ్యగల మా గోవిందశాస్త్రి సంగీతం గురించి జగన్నాథం చెప్పినదాని కల్లా బుర్రఊపి తనకు ఏ సినిమాలోనన్నా పాడేఛాన్సు యిప్పించమనీ, సినిమా సంగీతం కష్టపడి నేర్చుకుంటాననీ ప్రాథేయపడ్డాడు. "ఛీ, ఛీ, నీకు సినిమా సంగీతం వెయ్యి జన్మలకూడా రాదుపో" అన్నాడు జగన్నాథం. గోవిందం

చిన్న బుచ్చుకుని, తగ్గి వూరుకున్నాడు....ఏమిటో కళలుట, కళలు! ఈ బొర్లి కబుర్లతో జనం యిట్లా యెంతకాలం మోసపోతారో తెలీదు.... మా శర్మ నిర్వచనం చేస్తాడు....కళనుంచి కళాకారుడు ఆనందంతప్ప యేమీ ఆశించరాదుట! ఈ మాట అనేవాళ్ళంతా ఆరాధించే కళలేవయ్యా అంటే ఒకప్పుడు కళాకారులకు ధనధాన్యాదులు సంపాదించిపెట్టినవే! ఈ యుగం వాళ్ళకు డబ్బుచేసిపెడుతున్న సినమా కళను వచ్చేయుగం వాళ్ళు ఆరాధిస్తారు. ఇట్లాగే సాగిపోతుంది ఈ జీవితం.

అయినా ఈ కళల గొడవ నాకెందుకు? భగవంతుడు నాకే కళలోనూ ప్రవేశం ఇవ్వాడుకాడు. లేకపోతే ఈపాటికి ఏ సినిమానటుడో, స్క్రిప్టురైటరో అయిపోయి వేలకు వేలు సంపాదింతును. ఎప్పటికైనా మనం వ్యాపారం చేసే డబ్బు సంపాదించాలి. దానికి రోజులు బాగాలేవు. గత యుద్ధకాలంలో లక్షలు గడించిన లక్ష్మణ మూర్తికూడా ఆ మాటే అంటున్నాడు. మళ్ళీ యుద్ధం వచ్చినా బాగుండును. యుద్ధం వస్తే జనం చస్తారు, పట్టణాలు ధ్వంసం అవుతాయి నిజమే, కాని ఏంచెయ్యాలి? యుద్ధంవస్తే తప్ప నాబోటివాడికి నాలుగురాళ్ల దొరికే ఉపాయం లేదే. కిందటి యుద్ధంలో చూడరాదూ? ఆఖరుకు ఎందుకూ పనికిరాని మా వెంకటేశ్వర్లు కూడా ఉద్యోగం సంపాదించాడుగద! ఆ యుద్ధం అయిపోయిన ఆరునెల్లకల్లా మళ్ళా వాడి ఉద్యోగం పోయింది. ఆ పోవటం పోవటం వాడికి ఇంతవరకూ ఎవరూ ఉద్యోగమిచ్చిన పాపాన పోలేదు. అటువంటివాళ్ళెందరున్నారో, మరీ జపాను యుద్ధంలో దిగాక ప్రతివాడికీ ఉద్యోగం దొరికింది. మా వూరునుంచి ఎనిమిదిమందో పదిమందో పూనా వెళ్ళారు. అందరికీ మిలిటరీ ఎకౌంట్స్‌లో ఉద్యోగాలు దొరికాయి. కొందరు బొంబాయి వెళ్ళారు, కొందరు ఢిల్లీ వెళ్ళారు.

ముష్టి ఉద్యోగాలు, ఉద్యోగాలదేమిటిగాని వ్యాపారస్థులు బాగువద్దారు, తవుడూ చిట్టూ అమ్మినవాళ్లకూడా రెండు చేతులా డబ్బు చేసుకుంటే! ఈసారి యుద్ధమేవస్తే నేను వ్యాపారం చేస్తాను. కిందటి యుద్ధంలో వ్యాపారస్థులు డబ్బు చేసుకోవటం కళ్ళారా చూశానుగద. మావూళ్ళో తిరపతయ్య ఇనపకొట్టుమీద ఎంత లాభాలు చేశాడు! బియ్యం మర కంట్రాక్టు తీసుకుని, ఎందుకు ఇందులో ఇరుక్కున్నానా అని ఏడిచే గణపతికి ఒక్కసారి సిరి ఎత్తుకోలా? మందుల కొట్లవాళ్ళ సంగతి వేరే చెప్పనే అక్కర్లేదూ, మళ్ళీ తప్పక యుద్ధం వచ్చేస్తుంది. ఇల్లూ పొలమూ తాకట్టు పెట్టయినాసరే మందులూ మాకులూ కొని దాచి పెట్టేస్తాను. రెట్టికి రెట్టింపు లాభం వచ్చేస్తుంది. అది పెట్టి ఇంకా సరుకు

కొనేస్తాను. వర్క్‌షాప్ ఒకటి ఏర్పాటుచేస్తే దానిమీదే బోలెడంత లాభం వస్తుంది.... శాంతి, శాంతి అని కొట్టుకునేవాళ్ళను చూస్తే నాకు కడుపు మండి పోతుంది. వాళ్ళేమిటో రాజకీయాలు మాట్లాడతారేమిటి? యుద్ధమనేది కేవలం వ్యాపారదృష్టితో చూడవలసిన విషయం. ఎవడిక్కావాలి రాజకీయాలు? మనకేమీ రాజకీయాల సంబంధమే లేదు. యుద్ధమే రావాలిగాని ఏ దేశం తెచ్చిపెట్టినా మనకొకటే.

ఒక్కటే భయం— కంట్రోళ్లు పెడతారేమోనని! యుద్ధం వచ్చి లక్షలు లక్షలు గడించే అవకాశం ఏర్పడ్డాక కంట్రోళ్లు పెట్టటం, వాటిని ఉల్లంఘించిన వారిని ఎరెస్టు చెయ్యటం, ఫైన్‌లు వెయ్యడం, జైళ్ళకు పంపటం— ఇదంతా చాలా అన్యాయం తస్సదియ్యా, కొందరు తప్పించుకు తిరుగుతారు; ఆ విద్య మనక్కూడా తెలిస్తే బాగుణ్ను. అది మనకు తెలిసే లోపుగానే యుద్ధం వచ్చేసి అవకాశం కాస్తా జారిపోతుందేమో....

ఛీ, ఛీ; పాడు జీవితం; ఎటు తిరిగినా యేదో ప్రతిబంధకమే. మన అదుపులోకి రాకుండా వుండేటట్టుగా ఈ జీవితాన్ని యెట్లా యెవరు తయారు చేశారో తెలిస్తే బాగుణ్ను. మనం వుట్టి పుణ్యానికి కూచుని వూహల్లుతాంగాని చేతికి అందుబాటులో వున్న లక్ష్మిని అందుకోలేం. నాకు తెలీక అడుగుతాను, యేం వెర్రిబాగులదాన్ని చేసుకుంటే? గొప్పవాళ్ళ పిల్ల గదా అని మా వూళ్ళో హనుమంతయ్య కాయకన్నుదాన్ని చేసుకోలా? వాడికేం తెగులొచ్చిందీ? అత్త వారు వాడికి బోలెడు కట్నం యివ్వటంగాక, మంచి వుద్యోగం యిప్పించి పెట్టారు. హనుమంతయ్య అన్నలూ తమ్ములూ అడుక్కు తింటూనే వున్నారు; హనుమంతయ్య సంసారం మటుకు మూడువూలు ఆరు కాయలుగా వుంది.... అయిదువేల కట్నంగాక నాగయ్య కూతురిపేర ఆస్తి కూడా పెడతాడేమో. అంతగా అయితే ప్రేమించటానికి ఆడాళ్లు దొరక్కపోతారా? ఈ పిచ్చిమొద్దు అడ్డుపడపోయిందా? మగవాడి కేమిటి? అందులోనూ డబ్బున్న మగాడికి! అమ్మ మటుకు చాలా సంతోషిస్తుంది మనం ఏ వేషాలేసినా అదిదేమీ అనదు. ఇంకోళ్లు మాత్రం యేమంటారు? మామయ్యగారి వూళ్ళో మహలక్ష్మమ్మ కొడుకు వెర్రి బాగులవాడు. మహలక్ష్మమ్మ కోడలు పల్లిగ్గా వెంకట్రామయ్యకు పిల్లల్ని కనలా? యెవరన్నా, యేమన్నా అనగలిగారూ? ఆడదానికి లేని నీతి మగాడికొచ్చిందా యేం? యిదంతా ఆలోచించే అమ్మ ఈ ఆలోచన చేసింది. సరేననేస్తాను. ఎందుకొచ్చిన గుంజాటన? దీంతో అన్ని చిక్కులూ వదిలిపోతాయి. సీతకు మంచి సంబంధం దొరుకుతుంది. అది మొగుడితో హాయిగా కాపరం చేస్తూ

సుఖంగా వుంటుంది. నేనూ నా వెర్రిబాగుల పెళ్ళాం హాయిగా వుంటాం.... యేమో, అది పెళ్ళికాగానే చచ్చిపోగూడదూ? యెవడు చూశాడు? ఈ ఆడాళ్లు పూరికేనే చస్తారు. అది చస్తే హాయిగా వెంటనే రెండో పెళ్ళి చేసుకుని అందరి లాగే హాయిగా బతకొచ్చు. నాగయ్య దాని పేరనన్నా యింత ఆస్తి రానిస్తే బాగుణ్ణు? అదంతా దాని తదనంతరం మనకొచ్చేట్టుగా....

ఛీ, ఛీ, యేం బతుకు? ఈ పీడంతా లేకుండా యే దయామయుడన్నా ఓ వంద రూపాయల నౌకరీ యివ్వగూడదూ? వున్నదంతా తెగనమ్మి అయినా సీత పెళ్ళి భారం వదిలించేసుకుని సంపాదనమీద నిశ్చింతగా బతుకుదునే....

ఇంకో నెల రోజులపాటు చూస్తాను, ఉద్యోగం దొరికిందా సరేసరి, దొరకదూ, యెవరితోనూ చెప్పకుండా బ్రహ్మకపాలం లేచిపోయి బైరాగుల్లో చేరిపోతాను. ఈ దేశంలో బైరాగులుకి తిండికి చచ్చుండదు. అయితే, అదే మంచి పని. ఆ మఠంలోనూ ఆ మఠంలోనూ కాలం వెళ్ళబుచ్చొచ్చు. నిష్పూచిగా బతకొచ్చు. అంతే. ఈ భూలోకంలో ఈ పుణ్యభూమిలో బైరాగిమఠం మించిన స్వర్గం, శాంతిధామం లేదు. బైరాగిని మించిన స్వతంత్రుడూ లేడు. నిశ్చయంగా బైరాగుల్లో చేరిపోతాను. ముమ్మాటికీ చేరిపోతాను.

(ముద్రణ : 1968, పెళ్ళి చెయ్యకుండా చూడు కథలు, ఎమెస్కో ప్రచురణ)